

అంతన్నారు.. ఇంతన్నారు

డీఎస్సీపై డోలాయమానం కొనసాగుతోంది. అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు.


- 8లో



కమ్మల కోసం కర్కశంగా..

కమ్మల కోసం ఓ వృద్ధురాలిని కర్కశంగా హతమార్చారు. నరసన్నపేటలో ఘటన జరిగింది.

- 8లో



న్యూస్‌రీల్

కూటమికి చెంప పెట్టు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన బలపరిచిన పాకలపాటి రఘువర్మను ఉపాధ్యాయులు ఘోరంగా ఓడించారని, ఇది కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టు అని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వ శక్తులు ఒడ్డి పని చేసినప్పటికీ గెలవలేకపోయారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు స్వయంగా మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి ఎలాగైనా రఘువర్మను గెలిపించాలని చెప్పినా.. గెలుపును దరిచేర్చలేకపోయాయని పేర్కొన్నారు. మున్ముందు మరింత ఘోరమైన ఫలితాలను టీడీపీ నాయకులు చవి చూస్తారని చెప్పారు. ఎన్నికల్లో ఎన్ని కుయుక్తులు, ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురిచేసినా ఉపాధ్యాయులు లెక్క చేయకుండా సరైన తీర్పునిచ్చారని కొనియాడారు. ఓడిపోయాక మాట మార్చి, తాము బలపరచలేదంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని.. రాబోయే రోజులన్నీ కూటమికి ప్రతికూలమేననే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు.

కూటమికి కౌంట్‌డౌన్ మొదలైంది



నరసన్నపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థికి ఉపాధ్యాయులు తగిన బుద్ధి చెప్పారని, కూటమికి కౌంట్‌డౌన్ మొదలైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడుకి అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోమ వారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి బలపరిచిన అభ్యర్థి ఓటమికి కారణం ప్రభుత్వం పట్ల వ్యతిరేకతేనని అన్నారు. అధికారం కోసం అమలు కాని హామీలు ఇచ్చి కూటమి నాయకులు ప్రజల్ని మభ్య పెట్టారని విమర్శించారు. తొమ్మిది నెలల్లోనే అన్ని వర్గాల ప్రజలు నుంచి స్పష్టమైన వ్యతిరేకత వచ్చిందని, దీనికి నిదర్శనమే గాదె శ్రీనివాసులునాయుడు విజయం అని పేర్కొన్నారు. రఘువర్మ విజయం కోసం ఉత్తరాంధ్రలోని కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు అహర్నిశలు పనిచేశారని, పలువురిని మభ్య పెట్టారని, ఒత్తిడి చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయ ఎన్నిక చెంప పెట్టు వంటిదని అభిప్రాయపడ్డారు.

జిల్లా కార్యాలయానికి రావద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది, ప్రజలు వారి అవసరాలు తెలియజేసేందుకు జిల్లా కేంద్రంలో ఉన్న పీడీ కార్యాలయానికి రావద్దని డ్వామా పీడీ సుధాకరరావు సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది, ఇతర ప్రజలు ఉపాధి హామీ పథకానికి సంబంధించిన జాబ్‌కార్డు మంజూరు, జాబ్‌కార్డులో యాడింగ్, పేమెంట్ల కోసం తన కార్యాలయానికి రావద్దని ఆయన తెలిపారు. సమస్యలను మండల పరిధిలోని అధికారుల వద్దనే పరిష్కరించుకోవాలని సూచించారు. అక్కడ పరిష్కారం జరగకపోతే లేఖ ద్వారా తెలియజేయాలే తప్ప నేరుగా రావద్దని ఆయన తెలిపారు.

12 నుంచి శ్రీకూర్మనాథుని డోలోత్సవం

గార: శ్రీకూర్మం శ్రీకూర్మనాథుని డోలోత్సవాలు మార్చి 12 నుంచి జరుగుతాయని ఆలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామన్నసింహాచార్యులు, ఆలయ ఇన్‌చార్జి జి.గురునాథ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో 12వ తేదీ సాయంత్రం నుంచి కామదహన మంటపం వద్ద కామదహనోత్సవం (మఘ కాల్పు), 13వ తేదీన శ్వేతపుష్కరిణితో పాటు సముద్ర స్నానాలు (పడియ), చివరి రోజు ప్రధాన ఘట్టమైన డోలోత్సవం రోజున డోల మంటపం వద్ద శ్రీభూదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వాముల దర్శనం జరుగుతాయని, భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

డిప్యుటేషన్‌పై విధులకు ఎస్‌జీటీల నుంచి దరఖాస్తులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యాశాఖ సమీక్ష సమావేశంలో కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించేందుకు అర్హులైన ఎస్‌జీటీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఈఓ డాక్టర ఎస్.తిరుమలచైతన్య తెలిపారు. కంప్యూటర్ నైపుణ్యం, గణితశాస్త్రంపై నైపుణ్యం కలిగిన ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లను (సర్ప్లస్ ఎస్‌జీటీలు) గుర్తించి, నామినేట్ చేయమని కమిషనర్ ఆదేశించిన నేపథ్యంలో.. ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి సంక్షిప్త ప్రొఫైల్‌ను ఈనెల 5వ తేదీలోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలని డీఈఓ సూచించారు.

తొమ్మిది నెలల్లోనే

తిరుగుబాటు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయులు షాకిచ్చారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే టీడీపీ, జనసేనకు ఓటమి రుచి చూపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా తమ మనోభావాలకు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికను టీడీపీ నాయకులు భుజాన వేసుకోవడాన్ని ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోయారు. ఇప్పుడు అవకాశం ఇస్తే తమకు ఎదురు లేదని నాయకులు విర్రవీగే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. తామేంటో చూపిస్తామంటూ ఎన్నికల్లో ఓట్లేసి గట్టిగా దెబ్బ కొట్టారు.

అంచనాలకు తగ్గట్టుగా 'గాదె' గెలుపు..

ప్రభుత్వ వ్యతిరేక పవనాల మధ్య ఉపాధ్యాయవర్గాల్లో మంచి పట్టు ఉన్న గాదె శ్రీనివాసులునాయుడు బరిలో దిగుతున్నట్టు ప్రకటించినప్పుడే దాదాపు విజయం ఖరారైపోయింది. గతంలో రెండు ఎమ్మెల్సీగా పనిచేసిన తీరు, పీఆర్‌టీయూ సంఘంలో ఐక్యత, సామాజిక వర్గం తదితర విషయాలు గాదెకు కలిసొచ్చాయి. దానికి తోడు ఎమ్మెల్సీ ఎన్నికను టీడీపీ, జనసేన ప్రతిష్టాత్మకంగా తీసుకుని, గ్రామ స్థాయి నాయకుడి దగ్గరి నుంచి మంత్రులు వరకు సీరియస్‌గా పనిచేయడం మరింత ప్లస్ అయింది. ఉపాధ్యాయులను రెచ్చ గొట్టేలా సాధారణ ఎన్నికల మాదిరిగా ప్రచారం చేయడం, తాము మద్దతు ఇచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని ఒత్తిడి చేయడం, పోలింగ్ ముందు రోజున ప్రలోభాలకు గురి చేయడం, పోలింగ్ రోజున టీడీపీ నాయకులే శిబిరాలు పెట్టి ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం వంటి అంశాలు గాదె గెలుపునకు దోహదపడ్డాయి. ఓటర్లుగా ఉన్న ఉపాధ్యాయులను ప్రలోభపెట్టేందుకు టీడీపీ నేతలు ఎంత ప్రయత్నించినప్పటికీ వెనక్కి తగ్గలేదు.

రఘువర్మ స్వయం కృతాపరాధం

ఏపీటీఎఫ్ తరఫున పోటీ చేసిన పాకలపాటి రఘువర్మ ఓటమికి స్వయం కృతాపరాధమే కారణమని నిపుణులు అంటున్నారు. వాస్తవంగా ఏపీటీఎఫ్ బలమైన సంఘం. ఉత్తరాంధ్రలో ఓటర్లు ఎక్కువగానే ఉన్నారు. కానీ, టీడీపీ, జనసేన మద్దతుతో పోటీ చేయాలనుకోవడమే ఆయన కొంప ముంచిందనే వాదనవినిపిస్తోంది. వాస్తవంగా, రఘువర్మ సౌమ్యుడనే అభిప్రాయం ఉంది. పార్టీలతో సంబంధం లేకుండా ఏపీటీఎఫ్ తరఫునే పోటీ చేసి ఉంటే బాగుండేదని, కానీ, ఆయన టీడీపీతో కలవడంతో అప్రతిష్టను మూటగట్టుకున్నారని అంటున్నారు. వాస్తవంగా టీడీపీ మద్దతుతో పోటీ చేయాలన్న ఆసక్తి ఏపీటీఎఫ్ నాయకుల్లో చాలా మందికి లేదు. తొలుత కొందరు వ్యతిరేకించినట్టుగా కూడా తెలిసింది. అయితే అధికారంలో ఉన్న పార్టీలు తమ వెంట ఉన్నాయని, గెలుపు సాధ్యమవుతుందని హితబోధ చేయడంతో ఏపీటీఎఫ్ నాయకులు సైతం వెనక్కి తగ్గినట్టు తెలిసింది. కానీ ఈ నిర్ణయమే గెలుపు అవకాశాలను తీవ్రంగా దెబ్బ కొట్టింది. కూటమి నాయకులు పరోక్షంగా మద్దతు ఇస్తారనుకుంటే.. టీడీపీ, జనసేన నాయకులే మొత్తం ఎన్నిక ప్రక్రియను హైజాక్ చేసేశారు. తమ పార్టీ అభ్యర్థిలా రంగంలోకి దిగిపోయారు. గ్రామ స్థాయి నాయకుల దగ్గరి నుంచి మంత్రులు వరకు పాకలపాటి రఘువర్మ కోసం నడుంబిగించారు. దీంతో ఎన్నిక ఉపాధ్యాయ సంఘాల మధ్య కాకుండా టీడీపీతో జరిగిన ఎన్నికలా మారిపోయింది. చివరికి పోలింగ్ రోజున ఓటర్లను ప్రభావితం చేసేలా శిబిరాలు ఏర్పాటు చేయడం, వాటిలో ఉపాధ్యాయ సంఘ నాయకుల కంటే టీడీపీ నాయకులే ఎక్కువగా ఉండటంతో చర్చనీయాంశమైంది. ఇదే టీచర్లను ఆలోచించేలా చేసింది.

ఎన్నికల్లో ప్రభావితం చేసిన అంశాలివే..

మంచి ఐఆర్ ఇస్తానని, రివర్స్ పీఆర్‌సీ కాకుండా మంచి పీఆర్‌సీ ఇస్తానని చంద్రబాబు చెప్పడంతో సాధారణ ఎన్నికల్లో ఉపాధ్యాయులు అనుకూలంగా వ్యవహరించారు. కానీ అధికారంలోకి వచ్చాక పీఆర్‌సీ మాట దేవుడెరుగు, ఆ వేతన సవరణ సంఘానికి కనీసం చైర్మన్‌ను నియమించలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత దసరా, దీపావళి, సంక్రాంతి మూడు పెద్ద పండగలు గడిచినా ఒక డీఏ కూడా ఇవ్వలేదు. 2022 జూలైలో దరఖాస్తు చేసుకున్న ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, ఏపీ ఉద్యోగుల జీవిత బీమా అడ్వాన్సులు, పదవీ విరమణ చేసిన వారికి ఈ రోజుకి కూడా చెల్లింపులు చేయలేదు. ఎంతసేపూ గత ప్రభుత్వంపై నెపం నెట్టడమే తప్ప ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఇటీవల సంక్రాంతి సందర్భంలో బకాయి చెల్లింపునకు భారీగా నిధులు విడుదల చేసినట్టు చెప్పుకున్నారే తప్ప రాష్ట్రంలో ఏ ఉద్యోగి ఖాతాలో రూపాయి కూడా జమ చేయలేదు. ఇలా మరెన్నో నష్టం కలిగే నిర్ణయాలు తీసుకోవడం కూడా ఉపాధ్యాయులు తట్టుకోలేకపోతున్నారు. ఇవన్నీ ఎన్నికల్లో ప్రభావం చూపాయి. టీడీపీ, జనసేన పార్టీలు భుజాన వేసుకున్న రఘువర్మను ఓడించేలా చేశాయి.

సర్కారుకు టీచర్ల బెత్తం దెబ్బ

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన గాదె శ్రీనివాసులనాయుడు
- స్వయంకృతాపరాధంతో ఓటమిపాలైన పాకలపాటి రఘువర్మ
- ఎన్నికల్లో ప్రభావం చూపించిన టీడీపీ ప్రజా వ్యతిరేక విధానాలు
- ప్రభుత్వం హామీలను విస్మరించడంపై తీవ్ర అసంతృప్తిలో ఉపాధ్యాయులు



పొందూరులో ఏర్పాటు చేసిన ఏపీటీఎఫ్ శిబిరంలో రఘువర్మకు మద్దతుగా ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రచారం (ఫైల్)



సోమవారం రాత్రి ఆమదాలవలసలో ఉపాధ్యాయుల విజయోత్సాహం

స్వరం మార్చిన టీడీపీ..



పాకలపాటి రఘువర్మ ఎన్నికను భుజానికి ఎత్తుకున్న టీడీపీ తాజా ఓటమితో స్వరం మార్చింది. తాము ఇక్కడ పోటీ చేయలేదని.. చెప్పుకుంటూనే ఎదురైన ఓటమిని దూరం పెడుతోంది. గెలిస్తే మా వోడు.. ఓడితే కాని వాడు అని చెప్పుకునే ప్రయత్నంలో పడింది. సాక్షాత్తూ జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎమ్మెల్సీ ఎన్నికపై స్పందిస్తూ తాము పోటీ చేయలేదని.. పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటును గాదె శ్రీనివాసులు నాయుడుకు రెండో ప్రాధాన్యత ఓటును వేయా లని చెప్పామంటూ మాట మార్చారు. ఒక అభ్యర్థిని గెలిపించమంటూనే మరో అభ్యర్థిని కూడా గెలిపించండని అంతర్గతంగా చెప్పుకోవడాన్ని ఏమనుకోవాలో వారికే తెలియాలని... ఓటమిని స్వాగతించాలే తప్ప గెలుపు దరి చేరకపోవడంతో మాటమార్చడం సిగ్గుచేటని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి.

గట్టి పోటీ ఇచ్చిన యూటీఎఫ్ విజయగౌరి

పీడీఎఫ్ తరఫున పోటీ చేసిన యూటీఎఫ్ సంఘం నాయకురాలు విజయగౌరి ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చారు. వాస్తవంగా, యూటీఎఫ్‌లో ఎమ్మెల్సీ ఓటు ఉన్న ఉపాధ్యాయులు కాస్త తక్కువే అని చెప్పాలి. ప్రాథమిక పాఠశాల స్థాయిలో వారికి బలం ఎక్కువ ఉంది. హైస్కూల్ స్థాయి ఉపాధ్యాయుల బలం ఆశించినంత లేదు. కాకపోతే, విజయగౌరి వ్యక్తిత్వం, పోరాట తత్వం, పీడీఎఫ్‌కున్న నమ్మకం గెలిపిస్తాయ ని ఆశించారు. సంఘాలతో సంబంధం లేకుండా ఓటేస్తారని భావించారు. 100శాతం అనుకున్నంతగా కాకపోతే చాలా మేరకు విజయగౌరికి ఓటింగ్ పడిందని చెప్పుకోవాలి. తనకొచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లను చూస్తే గట్టి పోటీ ఇచ్చారనే అనుకోవాలి.



పాతపట్నం: ఎమ్మెల్సీ పోలింగ్ రోజున శిబిరంలో వర్మకు మద్దతుగా ఎమ్మెల్యే గోవిందరావు ప్రచారం (ఫైల్)



ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎచ్చెర్లలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రామీణ యువకుల కోసం ఈ నెల 12వ తేదీ నుంచి ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాల్లో 30 రోజుల ఉచిత శిక్షణలను ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. వివరాలకు 9553410809, 7993340407 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

జిల్లాలో కురసాల కన్నబాబు పర్యటన నేడు



కన్నబాబు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన కురసాల కన్నబాబు మంగళవారం తొలిసారిగా జిల్లాలో పర్యటించనున్నారు. పార్టీ అధిష్టానం రీజనల్ బాధ్యతలు అప్పగించిన తర్వాత పార్టీ పటిష్టతపై ఫోకస్ పెట్టారు. అందులో భాగంగానే మంగళవారం శ్రీకాకుళం వస్తున్నారు. పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలు, సీనియర్ నాయకులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులతో సమావేశం కానున్నారు. జిల్లాలోని పార్టీ అగ్రనేతలను ప్రత్యేకంగా కలిసి పార్టీ బలోపేతంపై చర్చించనున్నారు.

మందు బాబులకు ఝులక్

అటు సిండికేటు.. ఇటు అదనపు రేటు

- మొదలైన మద్యం దోపిడీ
- ఒక్కో బాటిల్‌పై రూ.10 అదనపు వడ్డన
- పలాస నియోజకవర్గంలో శ్రీకారం
- సిండికేట్‌ను తయారు చేసిన ఓ నాయకుడు
- కీలక నేత అంగీకరించడంతో ఎమ్మార్పీకి మించి విక్రయాలకు గ్రీన్ సిగ్నల్



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లాలో మద్యం దోపిడీకి అధికార పార్టీ నాయకులు తెర తీశారు. ఒకనేత అంతా తానై వ్యవహరించి, సిండికేట్‌కు నాయకత్వం వహించి, పలాస నియోజకవర్గంలో వసూళ్లకు శ్రీకారం చుట్టారు. కీలక నేతకు ముడుపులు ఇచ్చేందుకు ఒప్పందం జరగడంతో ఎమ్మార్పీకి మించి విక్రయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.10 అదనంగా వేసి షాపుల్లో విక్రయిస్తున్నారు.

2014–19 పరిస్థితులు పునరావృతం

ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయాలు జరపడం కొత్తేమీ కాదు. 2014–19 టీడీపీ హయాంలో బరితెగించి విక్రయాలు చేపట్టారు. ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. అప్పట్లో ఎమ్మార్పీకి మించి చేపట్టిన విక్రయాలపై మద్యం బాబుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇంట్లో డబ్బు అంతా మద్యానికి పోసేస్తున్నారని మహిళలు ఆందోళన చేశారు. అప్పట్లో లిక్కర్ వ్యాపారులు భారీగా సంపాదించారు. అందులో కొంత నేతలకు ముట్ట జెప్పారు. అది జిల్లా ప్రజలందరికీ తెలిసిన విషయమే. మళ్లీ ఇప్పుడా పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. ఇప్పటికే బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. అదే తప్పు అని గగ్గోలు పెడుతుంటే, ఇప్పుడు ఎమ్మార్పీకి మించి విక్రయాలు మొదలయ్యాయి. పలాస నియోజకవర్గంలో తొలుత శ్రీకారం చుట్టారు. ఇప్పుడది జిల్లా అంతా పాకే పరిస్థితి కనబడుతోంది.

చక్రం తిప్పిన నాయకుడు..

మద్యం షాపులను దక్కించుకున్న ఓ నాయకుడు కీలకంగా వ్యవహరించి, సిండికేట్‌ను ఏర్పాటు చేసి, అందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చారు. ఎవరికెంత ముడుపులు ఇవ్వాలో డిసైడ్ చేసి, తదనుగుణంగా కీలక నేతకు జరిగినదంతా చెప్పి, ఎమ్మార్పీకి మించి విక్రయాలకు తలుపులు తెరిచారు. ఏకంగా ఎక్సైజ్ పరిధిలో నిర్ణయాన్ని అమలు పరిచారు. ప్రస్తుతానికి ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.10 పెంచి విక్రయిస్తున్నారు. మున్ముందు ఈ పెంపు మరింత పెరగనుంది. జిల్లాలో తొలుత పలాస నియోజకవర్గం, సర్కిల్ పరిధిలోనే ప్రారంభించారు. కీలక నేత అండదండలతో ముందుకెళ్తున్నారు.

భారీగా ముడుపులు



ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరుపుకోవడానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో భారీగా ముడుపులు వెళ్తున్నాయి. స్థానిక, మండల, నియోజకవర్గ స్థాయి మేరకు అడ్డు తగలకుండా ఉండేందుకు కాసుల పంపకాలు చేశారు. ఈ నెలలో తొలి విడత ముడుపులు అందనున్నాయి. వ్యాపారం టర్నోవర్ చూసి ఈ ముడుపులు పెరిగే అవకాశం ఉంది. తక్కువ ధరలకు నాణ్యమైన మద్యం అందిస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దశల వారీగా తన కార్యాచరణ అమలు చేస్తోంది. ఇప్పటికే అధికారికంగా ధరలు పెంచి మద్యం బాబులకు వాత పెట్టింది. ఇప్పుడా అధికారిక ధరలకు రూ.10 పెంచి విక్రయిస్తూ మందు బాబులకు మరింత షాక్ ఇచ్చింది.

వంశధారలో

వినాశన కాండ

- వంశధార నదిలో ఇసుక అక్రమార్కుల బరితెగింపు
- పెద్ద పెద్ద గొట్టాల ద్వారా నీరు మళ్లింపు
- మారిపోతున్న నదీ గమనం
- పరిమితికి మించి తవ్వకాలు జరపడంతో అడుగంటిపోతున్న భూగర్భ జలాలు



ఇసుక తవ్వకాల కోసం వినియోగించిన జేసీబీలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఇసుక అక్రమార్కులు ఏకంగా వంశధార నదికి తీరని అన్యాయం చేస్తున్నారు. అధికారం చేతిలో ఉండడంతో అడ్డూఅదుపు లేకుండా రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించి, ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. ఇష్టారీతిన నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుల్లో రూ.కోట్లు సంపాదిస్తున్నారు. వంశధార నదీ తీరంలో ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంపుల్లో గుట్టల కొద్దీ ఇసుక తరలిపోతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.



బైరి వద్ద వంశధార నదిలో ఎక్కడికక్కడ తవ్వేసి, ఇసుక పోగులు వేసిన దృశ్యాలు

బైరిలో విధ్వంసం..

శ్రీకాకుళం రూరల్ పరిధిలోని బైరి గ్రామంలో నడుస్తున్న ఇసుక ర్యాంపుల నుంచి నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక లారీల్లో తోడేస్తూ తరలిస్తున్నారు. నదీగర్భంలోకి ఏకంగా అనధికారికంగా రహదారి వేసేశారు. నదిలో ఉన్న నీటిని పెద్ద పెద్ద గొట్టాల ద్వారా బయటకు మళ్లిస్తున్నారు. ఇసుక తవ్వకాలు జరిపే సమయంలో పాటించాల్సిన నిబంధనలు తుంగలో తొక్కేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న ఇసుక ర్యాంపుల్లో మీటర్ లోతులో కేవలం మనుషులతోనే తవ్వకాలు చేపట్టాలి. కానీ ఇక్కడ యంత్రాలతో తోడేస్తున్నారు. ఐదు నుంచి 10 మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేపడుతున్నారు. ఇసుక మేటలతో పాటు నదీ గర్భాన్ని తవ్వేసి, టన్నుల కొద్దీ ఇసుకను నదిలోనే పోగేసి ఉంచుతున్నారు. పెద్ద పెద్ద దిబ్బలుగా వేసి, అక్కడికే ఏకంగా లారీలను రప్పించి లోడింగ్ చేస్తున్నారు.

బోర్లు మొరాయిస్తున్నాయి..



బైరి పరిసర ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేయడంతో చాలా చోట్ల బోర్లు మొరాయిస్తున్నాయి. గ్రామంలోని వ్యవసాయ బోర్లు 70వరకు ఉన్నాయి. ఇటీవల మైనింగ్, రెవెన్యూ అధికారులు వచ్చి నదీ పరివాహక ప్రాంతాన్ని సందర్శించినప్పుడు గ్రామస్తులకు ఎలాంటి నష్టం లేకుండా చూస్తామన్నారు. కానీ ప్రస్తుతం అనుమతులకు మించి తవ్వకాలు చేయడంతో తాగునీటిని అందించే బోర్లు సైతం పనికి రాకుండా పోతున్నాయి. – మూల కృష్ణవేణి, బైరి

నదీ గమనానికి, బోర్లకు ముప్పు

నిబంధనలు అతిక్రమించి మీటర్ దాటి తవ్వితే నది సమతుల్యత దెబ్బతిని, ప్రవాహంలో మార్పు వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే గ్రామానికి సమీపంలో ఉండే నీరు కిలోమీటర్ల దూరం వెళ్లిపోయింది. గ్రామంలో గల తాగునీరు, సాగునీటి బోర్లు 40 వరకు మూలకు చేరిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో బోర్లకు నీరు అందుతూ మధ్యలోనే ఆగిపోవడంతో మోటర్లు సైతం పాడవుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నదిలో లోతుగా తవ్వకాలు జరపడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి ఆ బోర్లన్నీ పనికి రాకుండా పోతున్నాయి.





నదిలోకి అడ్డంగా వేసిన రోడ్డు

క్లుప్తంగా

సీనియార్టీ జాబితా సిద్ధం

- ఈనెల 10వ తేదీలోగా అభ్యంతరాల స్వీకరణ



డీఈవో కార్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాశాఖ భవిష్యత్తులో నిర్వహించే బదిలీలు/పదోన్నతులకు సంబంధించి తొలి అడుగు పడింది. ఈ మేరకు సీనియార్టీ జాబితాను రూపొందించింది. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, తత్సామానమైన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా సిద్ధమైంది. ఈ జాబితాను విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉంచినట్టు డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) ఆధారంగా రూపొందించిన సాధారణ సీనియార్టీ జాబితాలను శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌తో పాటు డీఈవో కార్యాలయ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. కాగా జాబితాపై అభ్యంతరాలను ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా లిఖిత పూర్వకంగా కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. అభ్యంతరం చేసే ఉపాధ్యాయుడి పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు, ఎంప్లాయి ఐడీ, జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనడంతో పాటు, అందుకు సంబంధించిన ఆధారాలు లేదా సాక్ష్యాలను జతచేయాలని స్పష్టం చేశారు. గడువు తేదీ తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవడం జరగదన్నారు. మరిన్ని వివరాలకు 90009 07101, 85558 20983, 81341 42450 నంబర్లను సంప్రదించాలన్నారు.

హుండీ ఆదాయం రూ.8.58 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని తాత్కాలిక హుండీ ఆదాయం రూ.8,58,795లు వచ్చిందని ఆలయ ఈవో పి.ప్రభాకరరావు సోమవారం తెలిపారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తుల సమక్షంలో ఈ హుండీ ఆదాయం లెక్కించారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.2,00,260లు, కేశ ఖండన ద్వారా రూ.1,560లు, స్థల పురాణం ద్వారా రూ.2,320లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.530లు, పులిహోర ద్వారా రూ.1,03,440లు, హుండీ కానుకల రూపంలో రూ.4,76,185లు, ఇతరుల ద్వారా రూ.74,500లు కలిపి మొత్తం రూ.8,58,795లు వచ్చిందన్నారు. కాగా గతేడాది రూ.7,55,558లు వచ్చాయి. కార్యక్రమంలో కొమనాపల్లి సత్యసాయి సేవా సంఘం అధ్యక్షుడు పైడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌కు ఆహ్వానం



సెమినార్‌కు ఆహ్వానం అందుకున్న బాలరాజు

హిరమండలం: మండలానికి చెందిన ఉపాధ్యాయుడు ముద్దాడ బాలరాజుకు అరుదైన గౌరవం దక్కింది. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించే రెండు రోజుల జాతీయ సెమినార్‌కు ఆహ్వానం అందిందని దుర్భలాపురం గ్రామానికి చెందిన బాలరాజు సోమవారం తెలిపారు. తన సేవలను గుర్తించిన యూజీసీ ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం. అలాగే గూనభద్ర గ్రామానికి చెందిన విద్యావేత్త అంపిలి ప్రశాంత్‌కుమార్‌కు సైతం ఆహ్వానం అందింది. ఈనెల 6, 7 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ సెమినార్ జరగనుంది. ఈ ఇద్దరూ ఆ సెమినార్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

రణస్థలం ఏజెన్సీకి బాధ్యతలు



రణస్థలం ఏజెన్సీకి స్టాక్‌ను అప్పగిస్తున్న దృశ్యం

పొందూరు: పట్టణంలో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ బాధ్యతలను రణస్థలం గ్యాస్ ఏజెన్సీకి తహసీల్దార్ ఆర్.వెంకటేష్ రామానుజులు సోమవారం అప్పగించారు. గ్యాస్ బండపై బిల్లు కంటే అదనంగా వసూళ్లు చేస్తున్న విషయంపై పొందూరులో పలువురు మహిళలు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. డీఎస్‌వో జి.సూర్యప్రకాష్, తహశీల్దార్ ఆర్.వెంకటేష్ విచారణ జరిపారు. విచారణలో రూ.40 నుంచి రూ.50ల వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు నిరూపణ కావడంతో చర్యలు తీసుకున్నారు. గోడౌన్‌లో స్టాక్‌ను నమోదు చేసి రణస్థలం ఏజెన్సీకి అప్పగించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఈశ్వరరావు, శంకరరావులు పాల్గొన్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు..!



- సీఎం తొలి సంతకంపై డోలాయమానం
- ప్రకటనలకే పరిమితమవుతున్న డీఎస్సీ
- ఎదురుచూస్తున్న అభ్యర్థులు

శ్రీకాకుళం: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు తొలి సంతకం పెట్టిన డీఎస్సీపై డోలాయమానం కొనసాగుతోంది. అదిగో డీఎస్సీ అంటూ ఎప్పటికప్పుడూ ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా, స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాలనుకునే నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది. 16,700 పోస్టులు భర్తీ చేస్తామని ఎప్పుడో ప్రకటించినా, ఇంకా విధివిధానాలు ఖరారవ్వకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గందరగోళం

117 జీవోను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వలన పాఠశాల విద్యలో గందరగోళం నెలకొంది. హైస్కూల్‌లో 3, 4 తరగతులు తీసివేయడం వలన స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్‌గా ఉండిపోయారు. ప్రాథమికోన్నత పాఠశాల వ్యవస్థనే ఎత్తివేయాలి యోచిస్తూ ఉండడం వలన 1,360 మంది ఎస్జీటీలు సర్‌ప్లస్ కానున్నారు. కొందరు అధికారులు మాత్రం సర్‌ప్లస్‌గా ఉన్నవారిని మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో నియమిస్తామని, అందువలన డీఎస్సీలో పోస్టులు యధాతథంగా భర్తీలు జరుగుతాయని చెబుతుండటం విశేషం. ఇప్పటికే ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులుంటే తరగతికి ఒకరు చొప్పున 5 గురు ఎస్జీటీలను, 120 మందికి పైగా విద్యార్థులుంటే ఐదుగురు ఎస్జీటీలతో పాటు ఒక ప్రధానోపాధ్యాయున్ని నియమిస్తామని ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది.

అలాగే మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులుండేందుకు సంయుక్త పాఠశాలల విలీనం కూడా ప్రభుత్వం నిర్ణయించింది. వీటన్నంటినీ బేరీజు వేసుకుంటే 100 మంది వరకు స్కూల్ అసిస్టెంట్లు, 500 వరకు ఎస్జీటీలను మోడల్ స్కూళ్లకు తరలించినా, ఇంకా 370 మంది స్కూల్ అసిస్టెంట్లు, 800లకు పైగా ఎస్జీటీలు మిగులుగానే ఉంటారు. ఈ లెక్కన డీఎస్సీ నిర్వహణ ఎలా చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ప్రభుత్వం మాత్రం వచ్చే విద్యా సంవత్సరంలోగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటిస్తోంది. విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి తగ్గించడం వలన మిగులు ఉపాధ్యాయిలను అక్కడికి తరలించవచ్చని, అటువంటప్పుడు డీఎస్సీ నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెబుతోంది. నిష్పత్తి తగ్గించినా మిగులు ఉపాధ్యాయులతో ఆయా పోస్టులను భర్తీ చేయడం జరుగుతుంది గానీ, డీఎస్సీ ఎలా నిర్వహిస్తారో ప్రభుత్వ పెద్దలు, రాష్ట్ర అధికారులకు తెలియాలి. ఏది ఏమైనా నిరుద్యోగులు మాత్రం డీఎస్సీ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారనడంలో సందేహం లేదు.

32 వేల మంది మిగులు

పండిట్ పోస్టులు అప్‌గ్రేడ్ చేయడం, 117 జీవో రద్దు చేయడం వలన దాదాపు 32 వేల మంది మిగులు ఉపాధ్యాయులు ప్రస్తుతం ఉన్నట్లు తెలిసింది. శ్రీకాకుళం జిల్లా విషయానికి వస్తే 463 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇందులో 280కి పైగా స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు, 175 ఎస్జీటీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అయితే జిల్లాలో 473 మంది స్కూల్ అసిస్టెంట్లు, 1000 మందికి పైగా ఎస్జీటీలు మిగులుగా ఉండగా, పండింట్ పోస్టులు అప్‌గ్రేడేషన్ తర్వాత 450 మంది వరకు పండింట్‌లు డీఈవో పూల్‌లో ఉన్నారు. వీరంతా మిగులుగా ఉన్నప్పుడు డీఎస్సీ పోస్టులు ఎలా భర్తీ చేస్తారనేది సందేహాస్పదం.

యథావిధిగా భర్తీ



డీఎస్సీలోని పోస్టులు యథావిధిగా భర్తీ అవుతాయి. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. ఇంకా పోస్టులు అవసరమవుతాయి.

– తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

ఎదురుచూస్తున్నాం



డీఎస్సీ కోసం ఎంతో ఎదురుచూస్తున్నాం. మరో రెండేళ్లలో వయో పరిమితి మించిపోతుంది. అందువలన ఈ డీఎస్సీపై ఆశలు పెట్టుకొని నిరంతరం శ్రమిస్తున్నాను. ప్రభుత్వం వేగవంతంగా భర్తీచేస్తే బాగుటుంది.

– అల్లంశెట్టి రూపవతి, డీఎస్సీ అభ్యర్థి

కోచింగ్ తీసుకుంటున్నా



ప్రస్తుతం డీఎస్సీ కోసం కోచింగ్ తీసుకుంటున్నాను. మెగా డీఎస్సీ అని ఎంతో ఆశపడ్డాం. ఇప్పుడు పోస్టులు తగ్గినా ఎప్పటికప్పుడు వాయిదాలు వేస్తుండడంతో నిరాశ పడుతూనే ఆశతో చదువుతున్నాను. ప్రభుత్వం త్వరగా డీఎస్సీతో ఉద్యోగాలు భర్తీచేస్తే ఎంతోమందికి మేలు జరుగుతుంది.

– విజయ, బీఈడీ అభ్యర్థి

ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించండి

- లేబర్ కోర్టు సూచన



రిజిస్ట్రార్‌కు సమస్య చెప్పే ప్రయత్నం చేస్తున్న తొలగించిన ఉద్యోగులు(ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూలో తొలగించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని లేబర్ కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు తీర్పు ప్రతిని ఫిర్యాదుదారులకు సోమవారం అప్పగించింది. వివరాల్లోకి వెళ్తే.. వర్సిటీలో 2024 జనవరి 1వ తేదీన 34 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అప్పటి వీసీ నిమ్మ వెంకటరావు నియమించారు. అయితే ఏడాది పూర్తయిన నేపథ్యంలో డిసెంబర్ 31వ తేదీన వీరిని తొలగించారు. వారంతా తమను అన్యాయంగా తొలగించారని లేబర్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో వర్సిటీ అధికారులు, తొలగించిన ఉద్యోగులు, ఏజీఎస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలతో పలుమార్లు చర్చలు జరిపారు. దీనిపై జనవరి 8, 23, ఫిబ్రవరి 7, 15, 24, 25 తేదీల్లో కోర్టు విచారణ నిర్వహించి, అనంతరం సోమవారం ఉత్తర్వుల ప్రతిని ఫిర్యాదుదారులకు అందజేసింది.

కక్షతో తొలగింపు..?

బాధిత అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ.. తమకు నోటీసులు ఇవ్వకుండా తొలగించారని, కనీసం మూడేళ్లు కొనసాగించాలని కోరారు. వర్సిటీ అధికారులు కేవలం కక్షతో తొలగించారని, అనంతరం అనేక మందిని ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా నియమించుకున్నారని ఫిర్యాదు చేశారు. వర్సిటీ అధికారుల తరుపున కాంట్రాక్టు అధ్యాపకులు పద్మారావు, జూనియర్ అసిస్టెంట్ రాధిక హాజరయ్యారు. ప్రతిఏటా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెన్యూవల్ చేస్తారన్నారు. అయితే వారి సేవలు సంతృప్తిగా లేవని, నియామకాలు సక్రమంగా లేకపోవడంతో తొలగించామని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో తాము రాజీకి ప్రయత్నించామని లేబర్ కోర్టు తెలిపింది. చర్చల్లో వర్సిటీ అధికారులు కొనసాగింపునకు ముందుకు రాలేదని, ఉన్నత న్యాయస్థానానికి అపీల్ చేసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో తొలగించిన ఉద్యోగులు హైకోర్టులో నడుస్తున్న కేసులో ఈ తీర్పు ప్రతిని చేర్చనున్నట్లు చెప్పారు. కాగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించిన అధికారులు, గత కొన్ని నెలలగా తమకు నచ్చినవారిని ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా రాజకీయ సిఫార్సులు ఆధారంగా నియమించడం చర్చనీయాంశంగా మారింది. మరోపక్క ఒక ప్రజాప్రతినిధి ఇంటి వద్ద పనిచేస్తున్న ఇద్దరికి వర్సిటీ జీతాలు చెల్లిస్తుండడాన్ని పలువురు తప్పు పడుతున్నాయి.

మానవ సేవే.. మాధవ సేవ

- త్రిదండి చినజీయర్ స్వామీజీ



ప్రసంగిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామీజీ

టెక్కలి: మానవ సేవే.. మాధవ సేవ అని త్రిదండి చినజీయర్ స్వామీజీ అన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శ్రీరామ పాదుకా పట్టాభిషేకం ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవంతుడి సేవ దగ్గర ప్రతీ ఒక్కరూ ఒదిగి ఉండాలని సూచించారు. మనిషి ఆలోచనల్లో మార్పు తీసుకురావడానికి వికాస తరంగిణి అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోందని వెల్లడించారు. ఇందులో భాగంగా మహిళల ఆరోగ్యానికి భద్రత కల్పించే దిశగా ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల్లో వ్యాపించే క్యాన్సర్‌ను నిరోధించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు సుమారు 7 లక్షల మంది మహిళలకు వైద్యం చేయించామన్నారు. అనంతరం శ్రీరామ పాదుకా పట్టాభిషేకం విశిష్టత గూర్చి ప్రసంగించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ప్రతినిధి వర్మ, లమ్మత మధు, జి.చంద్రశేఖర్, జి.రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో గోకార్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు



ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గతేడాది నిర్వహించిన గోకార్టింగ్ పోటీలు (ఫైల్)

టెక్కలి: స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల సృజనకు పదును పెట్టనుంది. కాలేజీలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు గోకార్టింగ్ చాంపియన్‌షిప్ సీజన్–2 పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు సోమవారం వివరాలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి సుమారు 17 బృందాలుగా 500 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఎండ్యూరెన్స్, ఇన్నోవేషన్, బిజినెస్ ప్లాన్, స్కిడ్‌ప్యాడ్, ఆటోక్రాస్ విభాగాలపై ఏర్పాటు చేస్తున్న ఈ పోటీల్లో పెట్రో ఆధారితమైన 11, ఎలక్ట్రికల్ ఆధారితమైన 6 బృందాలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రూ.4 లక్షల విలువైన నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆటోమొబైల్ రంగంలో నూతన ఆవిష్కరణలపై విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

సునీల్‌కుమార్‌పై కక్ష సాధింపు సరికాదు



ఎయిమ్ ఆధ్వర్యంలో దళిత సంఘాల జేఏసీ నాయకుల నిరసన

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌ను అకారణంగా రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేయడం సరికాదని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను అన్నారు. అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ శ్రీకాకుళంలో ఎయిమ్, దళిత సంఘాల జేఏసీ నాయకులు సంయుక్తంగా సోమవారం శాంతియుత నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ దళిత సీనియర్ ఐపీఎస్ అధికారిపై వేధింపులను ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని కోరారు. దళిత సంఘాల జేఏసీ కన్వీనర్ డాక్టర్ కంఠ వేణు మాట్లాడుతూ ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లారన్న కారణం చూపిస్తూ ఆయనను సస్పెండ్ చేయడం వెనుక కుట్రకోణం దాగి ఉందని ధ్వజమెత్తారు. చంద్రబాబు సీఎం అయిన నాటి నుంచి ఆయనను పథకం ప్రకారం పోస్టింగ్ ఇవ్వకుండా పక్కన పెట్టి, నెలల తరబడి వీఆర్‌లోనే ఉంచుతూ వస్తున్నారని పేర్కొన్నారు. ఇదే పంథాలో కూటమి ప్రభుత్వం కొనసాగితే దళిత జాతి ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్స్ ఇండియా మిషన్, దళిత సంఘాల జేఏసీ నాయకులు యజ్జల గురుమూర్తి, పురుషోత్తం, రాంబాబు, పెయ్యల చంటి, భూషణ్, అబ్బాస్, కొత్తూరు సత్యనారాయణ, సుంకు రమణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో నలుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం నలుగురు యువకులు వేర్వేరుగా 27 కేజీల గంజాయితో పట్టుబడ్డారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం నుంచి వివిధ రాష్ట్రాలకు గంజాయిని తరలించేందుకు పలాస రైల్వేస్టేషన్‌ను కేంద్రంగా చేసుకున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంట్లో భాగంగా అనుమానితులను గుర్తించి పట్టుకున్నారు. వారిలో మహారాష్ట్రకు చెందిన ప్రకాశ్ నరేంద్ర బెహరా, కేరళకు చెందిన కన్ను మహీన్, షాజహాన్ హుస్సేన్, పితార్ బీరాల ఉన్నారు. వారి వద్ద 6 కేజీలు, 21 కేజీల గంజాయి వేర్వేరుగా స్వాధీనం చేసుకున్నారు. అలాగే ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు సీజ్ చేశారు.

ఇద్దరు వ్యక్తులకు గాయాలు



గాయపడిన జగన్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

మెళియాపుట్టి: మండలంలోని చాపర నుంచి మెళియాపుట్టికి వెళ్లే రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఒడిశాలోని లావణ్యకోట గ్రామానికి చెందిన జగన్ అనే యువకుడు కుటుంబంతో సహా మెళియాపుట్టి వైపు ద్విచక్ర వాహనంపై ఒక శుభ కార్యానికి వెళ్తున్నాడు. అదే సమయంలో చాపర వైపు బైక్‌పై వెళ్తున్న యువకుడు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. అయితే జగన్ వెనుకన కూర్చున్నవారికి ఎటువంటి గాయాలవ్వకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఢీకొన్న యువకుడు ద్విచక్రవాహనం ఆపకుండా వెళ్లిపోయాడు. స్థానికులు 108 ద్వారా పీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యులు వచ్చి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులకు దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలుస్తోంది.

337 మంది గైర్హాజరు

- సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలు రాస్తున్న ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సీనియర్ ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. ఈ నెల ఒకటో తేదీన ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కాగా.. సోమవారం నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రారంభమయ్యాయి. సెట్–1 ప్రశ్న పత్రంతో తెలుగు, సంస్కృతం, హిందీ, ఒరియా పేపర్లకు పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 75 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలకు రెండోరోజు మొత్తం 18,782 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 18,445 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 337 మంది గైర్హాజరయ్యారు.

తనిఖీలు ముమ్మరం

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను అధికారులు చుట్టుముడుతున్నారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు జిల్లాలోని పొందూరు మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిస్టమ్ జూనియర్ కళాశాల, కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈసీ కమిటీ సభ్యులతో కలిసి ఆర్‌ఐఓ ప్రగడ దుర్గారావు పరీక్షకు ముందు శ్రీకాకుళం నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ను సందర్శించారు. అలాగే నగరంలోని చైతన్య సహకార జూనియర్ కాలేజ్, శాంతినికేతన్ జూనియర్ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు. రెండోరోజు పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

- దౌర్జన్యంగా ఉప్పు మడుల్లో రోడ్డు నిర్మించిన పోర్టు యాజమాన్యం
- అడ్డుకున్న ఉప్పు కార్మికులపై దాడి



హైకోర్టు ఆదేశాలతో ఫిబ్రవరి 21వ తేదీన సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి



రాత్రి వేళలో ఉప్పుమడుల మీదుగా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న పోర్టు యాజమాన్యం

సంతబొమ్మాళి: హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ మూలపేట పోర్టు యాజమాన్యం ఉప్పు మడుల్లో దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం చేపట్టడం, అడ్డుకున్న ఉప్పు కార్మికులపై దాడి చేయడంతో స్థానికంగా కలకలం రేగింది. నౌపడ సాల్ట్‌రన్ 1956 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గత 65 ఏళ్లగా 375.64 ఎకరాల్లో ఉప్పు సాగును చేస్తున్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా ఉప్పు మడుల మీదుగా పోర్ట్ యాజమాన్యం రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఉప్పు తయారీ యాజమాన్యం, కార్మికులు పోర్టు రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకున్నా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఫిబ్రవరి 20వ తేదీన రోడ్డు పనులు ఆపాలని సూచించింది. హైకోర్టు ఆర్డర్ కాపీని జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, ఇతర ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా ఉప్పు కంపెనీ యాజమాన్య ప్రతినిధులు అందజేశారు. హైకోర్టు ఆదేశాలతో ఫిబ్రవరి 21వ తేదీన టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి ఉప్పుసాగు మడుల మీదుగా జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించి నిర్మాణ పనులు ఆపాలని పోర్టు యాజమాన్యానికి తెలియజేశారు. దీంతో వారం రోజుల పాటు రోడ్డు నిర్మాణ పనులను పోర్టు యాజమాన్యం నిలుపుదల చేసింది. కానీ ఫిబ్రవరి 28వ తేదీ శుక్రవారం అర్ధరాత్రి నుంచి రోడ్డు నిర్మాణ పనులను పోర్టు యాజమాన్యం శరవేగంగా చేపట్టింది. దీంతో శనివారం రోడ్డు పనులను ఉప్పు కార్మికులు, కంపెనీ యాజమాన్య ప్రతినిధులు అడ్డుకున్నారు. దీంతో పోర్టు సిబ్బంది ఉప్పు కార్మికులపై దాడి చేసి వారి వద్ద ఉన్న సెల్ ఫోన్‌లను తీసుకొని తిరిగి తమపైనే దాడి జరిగిందంటూ ఫిర్యాదు చేశారు. దీంతో ఆ రాత్రి ఉప్పు తయారీ యాజమాన్య సిబ్బందిని పోలీసుస్టేషన్‌కు తీసుకు వచ్చి కొన్ని గంటల తర్వాత విడిచి పెట్టారు. దీంతో వారు భయపడి సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. ఈ విషయాన్ని ఏ అధికారికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఉప్పు తయారీ యాజమాన్యం వాపోతోంది. ఉప్పు మడుల్లో రోడ్డు వేయడం వల్ల ఉప్పు సాగు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కమ్మల కోసం.. కర్కశంగా..!

- వృద్ధురాలి దారుణ హత్య



గున్నమ్మ(ఫైల్)



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి

నరసన్నపేట: స్థానిక బొంతలవీధికి చెందిన కేవిటి గున్నమ్మ (85) సోమవారం వేకువజామున దారుణ హత్యకు గురైంది. స్థానికులు, వృద్ధురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వీధిలో ఇళ్ల ముందు పూలు మొక్కల నుంచి పూలు సేకరించి స్థానిక సత్యనారాయణ గుడి వద్ద భక్తులకు అమ్ముతూ గున్నమ్మ జీవనం సాగించేది. గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఆమెకు ఈ పని నిత్యకృత్యమైంది. దీనిలో భాగంగా ఎప్పటిలాగే సోమవారం వేకువజామున పూలు సేకరించి ఇంటి వద్ద నుంచి సత్యనారాయణస్వామి ఆలయానికి వస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు ముక్కు కమ్ముల చోరీకి ప్రయత్నించారు. ఈ సందర్భంగా కొంత పెనుగులాట జరిగినట్లు తెలుస్తోంది. గున్నమ్మ ఇంటి నుంచి ఆలయం వరకూ పూలు రోడ్డుపై పడి ఉన్నాయి. అలాగే ఆమె వస్త్రాలు ఆలయం ముందు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి సుమారు మూడు వందల మీటర్ల దూరంలో మృతదేహం గుర్తించారు.

చెడు వ్యసనాలే హత్యకు కారణం..?

కాగా పలుచోట్ల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలో కదలికల ఆధారంగా స్థానిక పురుషోత్తం నగర్‌కు చెందిన ఒక పాత నేరస్తుడే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చెడు వ్యసనాలకు బానిసైన ఒక 20 ఏళ్ల యువకుడు చేసిన పనిగా భావిస్తున్నారు. మద్యం మత్తులో ఈ చర్యలు పాల్పడినట్లు ఉంటాడని అభిప్రాయపడుతున్నారు. నిందితుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వృద్ధురాలి హత్యపై ఆమె కుమారుడు కేవిటి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

ఈడ్చుకెళ్లి హత్య..?

ఆలయం వద్ద నుంచి వివస్త్ర ఉన్న వృద్ధురాలిని ఈడ్చుకెళ్లి కామేశ్వరి నగర్ వద్ద ఒక మారుమూల రోడ్డుపై వదిలేశారు. వీపు అంతా బాగా గాయాలై ఉన్నాయి. ఆలయం నుంచి మృతదేహం ఉన్న స్థలం వరకు పలుచోట్ల రక్తం మరకలను పోలీసులు గుర్తించారు. ఉదయం అటుగా వెళ్లినవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్యం మత్తులో ఉన్న నిందుతుడు వృద్ధురాలిపై అత్యాచారం కూడా చేశాడనే అనుమానం వ్యక్తమవుతోంది. మృతదేహం ఉన్న స్థితిని చూసిన స్థానికులు ఈవిధంగా అనుమానిస్తున్నారు. దీంతో ఘటనా స్థలాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్వయంగా పరిశీలించారు. కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి, నిందితులను పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) శ్రీనివాసరావు, టెక్కలి డీఎస్పీ మూర్తిలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.